తుది సందేశం

[కథానిక]

= శ్రీ ఘట్టి ఆంజనేయశర్మ =

హడావుడిగా ఇంటరుక్లాసు కంపార్టుమెంటులో భార్యా, బిడ్డలతో ఎక్కేసరికి తల ప్రాణం తోకకొచ్చినట్లయింది. అంతకుముందు బెర్తు అంతా తనేఆక్రమించుకొని నిద్రించడానికి ప్రయత్నిస్తూవుండిన ఆవిడ మాఆవిణ్ణీ, పిల్లల్నీ ఎగాదిగా చూసి లేచి కూర్చొని చోటిచ్చింది. నేనుకూడా స్తిమితపడి ఓమూల ఒదిగికూర్చున్నాను-ఆపుణ్యాత్మురాలి ఘనకార్యాన్ని మనసులోనే అభినందించుకుంటూ.

అంతా మసకచీకటిగా వుంది. శూన్యనృక్కులతో కిటికీలోంచి తల బయటపెట్టి ఆలోచిస్తున్నాను: కాశీలో ఇన్నాళ్లు వున్నందుకు, చివరకు, నాకున్న మనోబాధ లేమీ తగ్గలేదని తెలిసింది. ఇంతకీ మా ఆవిడ పోరుపెడితే బయలుదేరాను. పడిన ప్రయాసనూ, వ్యయపరిచిన విత్తాన్నీ చూసుకుంటే వేమన చెప్పిన "ఇంటిలోని పోరు ఇంతింత గాదయా" జ్ఞప్తికివచ్చింది! అర్థంలేని ఆలోచనలతో చాలాసేపు అవస్థపడి, ఎప్పుడు కళ్లుమూశానో తెలియదు. మళ్లా కళ్లు తెరిచేటప్పటికి జనసమ్మర్దం తగ్గినట్లుగా వుంది. అంతకంటే ముఖ్యవిషయ మేమిటంటే - మాపిల్లలు మాకుచోటిచ్చిన ఆవిడ చుట్టూ అతిస్వతంత్రంగా చేరి అల్లరిచేస్తున్నారు. మాఆవిడ ఆవిడతో చాలాఆప్యాయంగా మాట్లాడుతోంది. ఆడవాళ్లలో ఎంత ఆప్యాయత వుందీ!

బాగా చీకటిపడింది. రైల్లో దీపాలు లేవు. నిశీథంలోకి యింక చూడలేకపోయాను. వాళ్ల అర్థాంతర స్నేహానికి నాకు ఆశ్చర్యం వేసింది! వాళ్లు చెప్పుకునే అస్పష్టవాక్కులను వినటంకంటే అప్పుడు నేను చేయగల ఉత్తమమైన పని మరి ఏదీ కనుపించలేదు. ఆవిడ ఇలా చెబుతూవుంది:

"నా పెళ్లి నాఇష్టానుసారం జరిగివుంటే నా జీవితం విషాదాంతం కాకుండా వుండేదేమో! ఆ మడతలుపడ్డ ముఖాన్నీ, నెరిసిన జుట్టునీ, ఆయనను నాసౌందర్యంతో పోల్చుకొని ఎన్నోవెన్నెలరాత్రులు ఏడుస్తూ, ఒంటరిగా, మేలుకొని గడిపేదాన్ని! రాను రాను గుండె రాయిచేసుకొన్నాను. ఒకవిధమైన తెగింపు, సాహసం, ప్రతీకారవాంఛ నాహృదయంలో ప్రవేశించాయి! మొదట తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ఆయన నన్ను భయపెట్టి కొట్టినా, కాలక్రమేణా నాకు సేవకుడికంటే ఎక్కువగా లొంగిపోయాడు. ఈవిధమైన మార్పువల్ల నే నాయన్ని ఎందుకు గౌరవించాలో బోధపడలేదు!......అది పిరికితనం కాదూ?

కూలివాళ్లలో భార్యాభర్తల్లో ఒకరికొకరు మనలో యిచ్చుకొనే గౌరవాలు యిచ్చుకోలేరు. అయినా వాళ్లు అనుభవించే ఆనందంగాని, హృదయం విప్పి మాట్లాడడంగాని మనం ఊహించనివి!

ఏమయినా—నన్నీ అధమస్థితిలోకి తీసుకొచ్చి, ఏమీ సంబంధం లేనట్లు ప్రవర్తించే సంఘానికిగాని, నేను ఆనందంతో, గౌరవంతో జీవితాన్ని వెళ్లబుచ్చుతున్నానని అందరూ అనుకోవాలని నా నిజఆనందాన్ని నాశనంచేసిన తల్లిదండ్రులకుగాని, వయస్సు దాటినా, పెళ్లిచేసుకొన్నా నసే ప్రతిష్ఠ నిలపడానికి నా యౌవనాన్ని బూడిదపాలు చేయ సాహసించిన నాభర్తకుగాని నా దురవస్థమీద ఎటువంటి సానుభూతీ లేదని నాకు త్వరలో తెలిసింది! దానిమీద నాలో ప్రతీకారవాంఛ ప్రబలంగా నిలిచిపోయింది. 'ప్రతీకారం'—అదే నా జీవితవాంఛ!!"

ఈమాటలు వింటున్నకొద్దీ నాకు ఆ కంఠధ్వని సుపరిచితంగా తోచింది! ఆ చెప్పే విషయాలన్నీ 'వివేచనాశక్తి' తో, పటుత్వంగా వున్నట్లు తోచినయ్. ఆవిడ తళతళ మెరిసే వెండిఫ్లాస్కులోని పాలు కాస్సిని గొంతులో పోసుకొంది. మా ఆవిడకూడా చాలా శ్రద్ధగా వింటున్నట్లు అగుపడింది!.........

"ఇంతలోనే మా మరిది పెండ్లి వచ్చింది. చాలామంది స్నేహితులూ, బంధువులూ వచ్చారు. అప్పుడే నా జీవితంలో ఒక మానసిక విప్లవానికి బీజం నాటబడింది. మా మరిది పెండ్లి బాధ్యతలో మా ఆయన పడిపోయినారు.

నేను కృష్ణశర్మను అప్పుడే చూడడం! కండలు కట్టిన శరీరం, పచ్చటి దేహచ్ఛాయ, నిగనిగలాడే నల్లటి జుట్టు, ఆకర్షించి, లోతుగా పరిశీలనచేసే, మెరిసే చిలిపికళ్లు - ఆయనతో మాట్లాడమనీ, పరిచయం చేసుకోమనీ నన్ను వేపుకు తినేవి! నావంక అప్పుడప్పుడు ఆగి, నిదానంగా, ప్రశ్నార్థకంగా చూసేవాడు. చాలాసార్లు సిగ్గుపడి, ఆ చూపుల వేడి భరించలేక పారిపోయేదాన్ని!..........."నీ కేమిటి లోపం.........నే నుండగా?" అన్నట్లుండేది ఆచూపు! మా మరిదికి ముఖ్యస్నేహితుడు గాబోలు - ఎప్పుడూ ఆయనదగ్గిరే కూర్చొని మాట్లాడుతుండేవారు...............నిజం చెప్పొద్దూ! ఏదో విషయంతో వీలైనంతవరకూ ఆయనను చూచేందుకు నేను ప్రయత్నించేదాన్ని!

పెండ్లి అయిపోయేరోజున ఆయన నన్ను ఒంటరిగా మేడమీద చూశారు. నే నామన్మథరూపాన్ని గ్రాన్నపుడి చూడటంకంటె ఏమీ చెయ్యలేకపోయాను. కాసేపు అలానే గడిచింది. తర్వాత మెల్లిగా ఆయన నాదగ్గిరి కొచ్చి నడుంచుట్టూ చెయ్యివేశాడు. ఆ చేతిని నేను తీసివేయలేకపోయాను!! విద్యుచ్ఛక్తి నాలో ఒక్కసారిగా ప్రవహించినట్లు భావించాను. అసలు ఆచేతిని తొలగించే శక్తిని అప్రయత్నంగా కోలుపోయాను. ఆయన నాదగ్గరకు వస్తూవుంటే స్వర్గద్వారాన్ని సమీపించిన ట్లనిపించింది. సిగ్గుతో తల వంచుకున్న నాతలను మృదువుగా పైకెత్తి నాకళ్లల్లో కళ్లు పెట్టి చూశారు. ఎంత గంభీరమైన కళ్లు అవి! అందులో ఎన్నో ప్రేమసముద్రాలు ప్రవహిస్తున్నట్లు తోచింది! నా పెదవుల్లోని ప్రేమమధువును గ్రోలారు. కళ్ల నీళ్లు ప్రవహిస్తూవుండగా "మరిచిపోకండేం"అన్నాను. జయించిన ధీరుడిలాగా "మరిచిపోగలనా ?"అన్నాడాయన తన కళ్ల నీళ్లను నా కళ్ల నీళ్లతో కలుపుతూ!......నేను భయపడిన లేడిలాగా అతని హృదయాన్ని హత్తుకున్నాను. అతని శరీరమంతా ఆక్రమించుకొన్నాను... ఆ పండువెన్నెల్లో అతని శరీరసౌందర్యంమీద నాలో ఇన్నాళ్లూ ప్రబలిన కోరికలు విజృంభించి నృత్యం చేశాయి!

నాగస్వరానికి పాము ఆకర్షింపబడినట్లు నేను వశమైనాను!...అతనిది ప్రణయవేదన కాదు!...కామప్రకోపకర్షన!... "బాగుండదు-వెళ్లొస్తా"నంటూ వెళ్లలేక వెళ్లలేక బయటపడ్డాను అతని దివ్యమూర్తినుండి... ఆనాటి దివ్యరాత్రికి...విధిలేక......"

ఇంతలో దీపాలు వెలిగాయి. చూశాను...... సందేహనివృత్తి అయింది! ఆవిడనోటినుంచి "కృష్ణశర్మ" అన్న మాట వినేటప్పటికే నామీద పెద్ద పిడుగు పడ్డట్లయింది! ఆరాత్రి ప్రకృతిగంభీరసౌందర్యంలో నాచేతుల్లో నలిగిపోయింది మాఆవిడతో ఇప్పుడు ముచ్చటించే ఆవిడే. పేపరు ముఖానికి అడ్డం పెట్టుకుని దొంగతనంగా ఆమెవంక తేరిపార చూశాను. అదే ముఖం! అవే ఎఱ్ఱటి చిన్ని పెదవులు! చూడలేను ఆ శరీరాన్ని !...అవును, ధైర్యంగా చూడగల శక్తిని కోల్పోయాను. ఎంత మార్పు?

పిల్లలు అమాయకంగా ఆవిడతొడమీద నిద్రపోయినారు. వాళ్ల ముఖాల్ని చూస్తుంటే సిగ్గేసింది! ఆ చిన్ని హృదయాల్లో ఎటువంటి రాగద్వేషాలూ లేవు! అవి నిర్మలగంగాప్రవాహాలు! ఏం చెయ్యాను! నేనే ఆ కృష్ణశర్మను. రైల్లోనుంచి దూకనా! ఎందుకీ వేదన?

దీపాలు మళ్ళీ ఆరిపోయినాయి. ఈ చీకటి నా వేదనను కప్పిపుచ్చే రక్షణ.

"ఆ ఉదంతం ముగిసినవెనుక నేను మళ్ళీ ఈ జన్మలో ఆయన్ని కలుస్తా నను కోలేదు. మావారు

చాలాకాలం జిల్లా కలెక్టరుగా పనిచేశారు. ఒకసారి ఆయన్ని అకస్మాత్తుగా మరోజిల్లాకు బదిలీచేయటంతో వెంటనే అక్కడికి బయలుదేరవలసివచ్చింది! నాకు బాగా జ్ఞాపకం. రైలు కదులుతుంటే తొందర తొందరగా మేమున్న కంపార్టుమెంటులోకి ఒక పొడుగాటి యువకుడు ఎక్కాడు! తీరా చూద్దునుకదా— "కృష్ణశర్మ"!! బంట్రోతులు నెట్టివేయబోతుంటే నేను వారించాను. నావంకకు జాలిగా, ప్రేమగా, ఆశ్చర్యంగా చూశాడు! నేను కలెక్టరుగారి భార్యనని తెలిసిగాబోలు ఒక్కసారిగా అతనిముఖం వివర్ణమయింది! నవ్వడానికి ప్రయత్నించిన్నీ విఫలుడైనాడు. రైలుచప్పుడు వింటూ మేము మూగజీవాల్లాగా గడిపాము. అతడు దిగిపోతుంటేకూడా నేను పలకరించలేక పోయాను. మాఇద్దరిలో చెక్కుగట్టిన గాయాన్ని కదిపినట్లయింది!

అతను కలెక్టరు ఆఫీసులో గుమాస్తాపని చేస్తున్నాడని నాకు తెలియదు. అందులోనూ మాఆయన కనుసన్నల్లో మెలిగే ఉద్యోగమని ఎన్నడూ వూహించలేకపోయాను. ఒకనాడు మాఆయన ఎందుకో ఏదో ఆఫీసుపనిమీదగాబోలు అతనికి కబురుపంపించారు. బంట్రోతుతో "కృష్ణశర్మను పిలుచుకొనిరా" అనడం నాచెవుల్లో పడింది. ఏమిటో నాకు భయమూ, ఉద్వేగమూ, ఆనందమూ కలిగాయ్ అప్రయత్నంగా!! నిముషంలో ముస్తాబు చేసుకొన్నాను. ఒక్కసారి నారాజు నావంక కన్నెత్తి చూస్తేచాలునని ఆరాటపడ్డాను.

అతను నెమ్మదిగా కాలుకాలిన పిల్లిలా వచ్చాడు. ముఖంలో కళాకాంతులు లేవు! కృశించినట్లు అగుపడ్డాడు. మా ఆయన ఠీవిగా "ఏమోయ్-శర్మా" అనటంతోటె వంగి నమస్కారం చేశాడు. ఎక్కడి నుంచీ వచ్చింది ఆ వినయం ?? ఆ దివ్యరూపాన్ని ఏచీకట్లో దాచాడో !! మా ఆయన పడక కుర్చీమీద కూర్చుంటే స్కూలుపిల్లాడి లాగా చాపమీద కూర్చున్నాడు నా రాజు! రాజరాజు సారంగధరుణ్ణి రాజాస్థానంలో విచారించినట్లుంది ఆ దృశ్యం! నేను చిత్రాంగినా! కన్నీటి వెల్లువని కష్టంతో ఆపుకున్నాను! ఇందాకటి నుంచీ చాటు చాటుగా ఒంటికన్నుతో చూశాను......ఇంక భరించలేకపోయాను. మెల్లిగా తెర తొలగించి, ముఖాన్ని బయటపెట్టి అతని వంక చూశాను! చాలా సేపటికి తలెత్తి ఆత్రతగా చూసే నా కళ్లల్లోకి ఒక వెఱ్ఱిచూపు చూశాడు. "నన్ను క్షమించండి — అపచారం చేశాను" అన్నట్లుంది ఆ చూపు! "ఎందుకమ్మా అలా చూస్తావ్? — నువ్వేం అపచారం చేశావ్?" అన్నట్లు అతని వంక చూశాను. కాని అతనివద్దనుంచి నేను అర్థం చేసుకోగల సమాధానమేదీ నాకు అందనేలేదు. అదొక విచిత్ర సంఘటన!........

లోపలికి వెళ్లి దిండులో తల దూర్చి భారం తీరేటట్టు ఏడ్చాను! నా స్వామికి నా వేదన తెలియదు! ఈ కన్నీటి వెల్లువని చూసి భరించలేడేమో అని వెంటనే మెల్లిగా లేచి నలిగిపోయిన జుట్టు తిరిగి దువ్వుకొని, వాకిట్లోకి వచ్చేటప్పటికి శర్మ "శెలవు" అంటున్నాడు. నాకు ఏమీ తోచలేను! దాసీదాన్ని పిలిచి, గబగబా "రేపు సాయంకాలం అయిదింటికి రండి — అన్నీ స్వయంగా" అంటూ ఒక చీటీ వ్రాసి, ఆయన కియ్యమని దానిచేతికిచ్చి పంపించాను. "సరేనన్నా" రని దాసీది వచ్చి చెప్పేవరకు గుండెల్లో రైళ్లు పరిగెత్తినయ్........

మర్నాడు అయిదింటికి భయపడుతూ భయపడుతూ వాకిటెదగ్గర వచ్చి నుంచున్నాడు. "లోపలికి రండి" అన్నాను. తలవంచుకొని "క్షమించమని అడగడానికి వచ్చా" నన్నాడు. ఆ పరితాపంలో ఆముఖం ఎంత అందంగా వున్నదః!! మెల్లిగా చెయ్యి పట్టుకొని లోపలికి తీసుకెళ్లి "ఎందుకూ?" అన్నాను. మౌనం వహించాడు నారాజు! ఆ ముగ్ధమౌనంలో అమూల్యకాలాన్ని వ్యర్థపరచదలచుకోలేదు! దగ్గరికి లాక్కొని బుగ్గన్ని, నుదుటిని పెదవుల్ని నలిపేశాను. అతనిలో సంచలనం కలిగింది! భయపడిన పిల్లాడిలా నన్ను కౌగలించుకున్నాడు. ముద్దులు కురిపించాడు. నా కళ్లల్లో కళ్లు పెట్టి చూడలేకపోయాడు!!

"నన్ను చంపెయ్యరాదూ? ఇలా ఏడిపించకపోతే" అన్నాను. భరించలేక ఒకసారి గంభీరంగా నిట్టూ

ర్చాడు! నన్ను అమాంతంగా ఎత్తుకొని తోటలోకి తీసుకపోయాడు. ఆచెట్లమధ్య చాలాసేపు గడిపాము.

అలాగే ఏకాంతంగా, చింతలేకుండా కొన్ని రోజులు జరిగాయి. ఒకనాడు మేము తోటలోవుండగా మాఆయన నన్ను పిలుచుకుంటూ సరాసరి అక్కడికి వచ్చారు. ఆఅలికిడిని పసిపట్టి శర్మ మెల్లిగా గోడదూకి పారిపోయాడు. కాని మాఆయనకు సందేహంమాత్రం వదలలేదు. ఎవరో వచ్చిపోయినట్లు ఆయన పసిగట్టారు.

అప్పటినుంచి తన అంబేదతనాన్ని బాగా గ్రహించి తోటచుట్టూ గట్టికాపలా పెట్టారు.

మరోసారి నేనొకచీటీ వ్రాసి దాసీదానిద్వారా పంపించాను. మాఆయన చూసి ఏమిటని అడిగారు. "కూరగాయలకోసం చీటీ వ్రాశా" నన్నాను. నన్ను పోనిచ్చి, ఆయన దాన్ని పిలిచి, చీటీ తీసుకొని మూశారు! ఇంకేముంది? కొంప మునిగింది! ఆయనమనస్సుకు ప్రత్యక్షనిదర్శనం దొరికింది! నా కీవిషయం మొదట తెలీలేదు. ఆయన కడుపులోనే దాచుకుని సమయం కోసం నిరీక్షిస్తున్నారు. మామూలుగానే ఆయన ఆనిలిస్తే వ్రేగులు లెక్కపెట్టే మనిషి. నేను నీటుగా ముస్తాబై కనుచీకట్లో "కృష్ణశర్మ"కోసం కాచుకొనివున్నాను. నవవసంతుడిలాగా శర్మవచ్చాడు. "ఎన్నాళ్లు ఈసందిగ్ధ మయజీవితం? పెళ్లిచేసుకొని ఎక్కడైనా వెళ్లిపోదాం... నే నింతవరకూ ఎవరివల్లా అపవిత్రురాల్ని కాలేదు" అన్నాను, అతనిభుండెలమీద తల ఆనించుకొని తోటలో. అత డెందుకో ఆవేళ అంత సంతోషంగా లేడు! మేమిట్లా మాట్లాడుతుండగా మాఆయన ఉగ్రరూపంతో అక్కడికొచ్చారు! తేనెతుట్టెమీద రాయి పడినట్లు ఇద్దరూ ఖంగారుగా లేచి విడిపడ్డాము. మాఇద్దరివంకా ప్రచండంగా చూస్తున్నారు! "బుద్ధి లేదూ? ఇదా నువ్వు చెయ్యవలసిన నీచకార్యం" అన్నట్లు చూశాడు శర్మవంక! అతను తల వంచుకొని వెళ్లిపోయాడు.

ఇంక ఆరాత్రి నే నాయనచేతిలో చిదికిపోయినాను. నేను వ్రాసిన జాబు చూశానన్నారు. నాచర్యలన్నీ తన కవగతాలేనని చెప్పారు. కసిదీరా గంటల కొలదీ కొట్టారు! గాజులు పగిలి, ఒళ్లువలిగి, జుట్టు రేగి ఆయనపాలిట నేను ఒక దయ్యంగా గోచరించాను! చివరకు "వాడేగా. ఫో...నీసంరక్షకుడు! వెధవని, ఏంచేస్తానో చూడు!" అంటూ ఆ రాత్రి నన్ను బయటికి వెళ్లగొట్టి తలుపువేశారు. కాని అందుకు నేను విచారించనే లేదు!! ఎప్పటికన్నా నాజీవితంలో ఇలాంటి దుర్దశ సంభవిస్తుందని తలవకపోతే కదా! ఆ చలిరాత్రిలో, ఒంటిబట్టతో, మా లచ్చిని వెంటవేసుకొని "కృష్ణశర్మ" ఇంటి కెళ్లాను! నాజీవితంలో చివరి ఆశాజ్యోతి యిక్కడే ఆరిపోయింది!!-- సరాసరి లోపలికి వెళ్లక కిటికీలోనుంచి తొంగి చూశాను. ఆయన తల్లి గాబోలు, అంటున్నది: "ఒరే... నాయనా...నిజమెంతో కాని నువ్వు కలెక్టరుగారి భార్యతో ఎక్కువగా మాట్లాడుతున్నావని ఎవరో అన్నారురా! పెళ్లయినవాడివి! చిన్నవాడివా, చితకవాడివా? ఇదేం బుద్ధిరా" అంటున్నది. ఆ చిన్న దీపకాంతిలో ఆయన కన్నీరు కార్చడం చూశాను. ఆయన కంపితస్వరంతో ఇలా అన్నారు: "నాకు మెడలు విరిచి పెళ్ళిచేశారు! నే నేం చెయ్యను? నన్ను చంపండి......నరకండి" ఇంక నేను వినలేకపోయాను! శర్మకు పెళ్లయిందని అప్పుడుకాని నాకు తెలియలేదు! ద్రోహి!......అతడు చేసిన ఘనకార్యాన్ని వెల్లడించి అతన్ని "నింద" పాలు చేద్దామనే ఆక్రోశం నాలో ప్రవేశించింది.......కాని నాలాంటి ఆ ఇల్లాలి జీవితంలో నిప్పులు పోయడం నా కిష్టంలేకపోయింది! నాజీవితం సంఘం గొప్పగా విలువకట్టే స్థితిలోకిరాదనీ, ఎన్నడూ రాలేదనీ నాకు తెలుసు!

తర్వాత నేను పడిన బాధల్ని చెప్పలేను!... చివరకు క్రైస్తవమతంలో చేరి, వాళ్లదగ్గర విద్య నేర్చుకొని ఉపాధ్యాయవృత్తితో వుంటున్నా అయిదేళ్లనుంచి!" అని పెద్ద నిట్టూర్పుతో ముగించింది.

"అయితే మీఆయన గతేమిటి?" అంది మా ఆవిడ.

"మొగవాళ్లు కదూ! వారు మళ్ళీ పెళ్ళిచేసుకొన్నారని విన్నా" నంది ఆమె. "విశేష మేమిటంటే

కర్మ ఆ ఉద్యోగాన్నే ఎలాగో అంటిపెట్టుకున్నాడని విన్నా!"

నేను బాధతో, పరితాపంతో కుళ్ళిపోయా ఇంతసేపూ! మాటలు శూలాల్లాగా నాహృదయంలో పొడుచుకున్నవి! చీకట్లో మొఖానికి అడ్డం పెట్టుకున్న పేపరంతా తడిసింది.

లైట్లు ఒక్కసారి వెలిగివాయ్. ఇంతలో మాఆవిడ తనఇంటి విషయాలు చెబుతూ "ఆయనే మావా" రంది. ఒకసారి ఇద్దరూ నవ్వారు! చూచుకున్నా—పేపరు తలక్రిందుగా పెట్టి చదువుతున్నానని! ..."ఏమండోయ్—ఇలా చూడండి" అంది మాఆవిడ. నేను మాట్లాడలేదు. కాని ఆమె దగ్గరికొచ్చి "మంచి నీళ్లు కావాలా?—మాటలధోరణిలో మీసంగతే మరిచిపోయాను!" అంటూ పేపరు తొలగించింది. ఇద్దరూ చకితులయ్యారు! నన్నావిడ చూసింది. నే నావిడను చూశాను! మాఆవిడ ఇద్దర్నీ చూసింది! ముగ్గురం మాటల్లేక మూగజీవాల మయ్యాం మళ్ళీ! గొంతు పెగల్చుకొని "నన్ను క్షమించండి — రాక్షసుడిని" అన్నా. ఆవిడ నాదగ్గరి కొచ్చి కళ్లనీరు తుడిచి "అయిపోయింది పోనివ్వండి — మళ్లా ఈ జన్మలో మిమ్మల్ని చూస్తా ననుకోలేదు." అంది. ఆ భీకర రైలుకూతలో నా గుండెమీద తలవుంచి భారం తీరేటట్లు ఆమె రోదించినవిషయం మాకు వినిపించియుండదు! అది కన్నీరు కాదు! జరిగిన ఘట్టాల స్మృతికి చిహ్నం!...

ఎంతో మాట్లాడా లనుకున్నాం—మాట్లాడుకో లేకపోయినాం!

రైలు స్టేషనులో ఆగింది. ఆవిడ ఛటుక్కున అయిదు పచ్చకాకితాలు మా ఆవిడచేతిలో కుక్కి "పిల్లలకి నా బహుమానం" అంటూ నా వంకకు తిరిగి "ఇదివరకు కామించుకొని, ప్రేమించుకొన్నా మనుకున్నాం!...కాని ఇప్పుడు హృదయపూర్వకంగా ప్రేమించుకొందాం—మన జీవితాలు రెండు సమాంతర రేఖలయినా, మనం పాయలుగా విడిపోయినా మిమ్మల్ని మరిచిపోలేను!...అది నా బలహీనత కావచ్చు... కాని నా చివరి సందేశం—నన్ను మరిచిపోకండేం!" అంది. మా ఆవిడ "ఎందుకండీ ఇవి?" అనే మాటల్నీ, నేను విలపిస్తూ పిలిచిన ఆర్తనాదాన్నీ వినకుండానే ఆ చీకటిలోనుంచి మెరుపుతీగలాగా మాయమయింది నా స్వప్నరాణి! నన్ను నిద్రలేపిపోయింది శాశ్వతంగా!

ఆ నిశీథంలోకి చూడలేకపోయాను. నా పాపం పండి, చివరకు చీకటిగా మారిందా అనిపించింది. కళ్లు మూసుకున్నాను! కాని నా వెనుక దయ్యాలూ భూతాలూ పరిగెత్తుకొన్నట్లూ, తరుముతున్నట్లూ తోచింది!..."శాంతి" అంటే అర్థంగాని, అనుభవించటంగాని నాకు తెలియదు! బహుశః...ఎప్పుడో, చిన్నతనంలో అనుభవించినట్లు జ్ఞాపకం!